

# అత్తగారూ పిత్రు దేవతలూ

భానుమతీ రామకృష్ణ

మా వంటవాడికి ఒంట్లో బాగా లేదనీ, వాళ్ళ వూరు వెళ్ళి, నాటుమందులు తిని నయంచేసుకొస్తాననీ చెప్పి ఆరోజే బయల్దేరాడు.

"ను వ్వొచ్చిందాకా మాకు వంట ఎవరు జేస్తార్రా?" అన్నారు మా అత్తగారు.

వాళ్ళ వూరుమనిషి ఎవడో వున్నాడనీ, కాని అతనికి వంట బాగా చేతకాదనీ, తను వచ్చిందాకా అతనికి జీతం యివ్వక్కర్లేదనీ, తను త్వరగానే వచ్చేస్తాననీ చెప్పి వెళ్ళాడు.

వంటవాడు వెళ్ళిన మర్నాడు గేట్లో ఎవరో రామశాస్త్రి అనే మనిషి వచ్చాడని ఘూర్కా చెప్పాడు.

"బహుశా మన వంటవాడు పంపించాడేమోనే?" అంటూ అతణ్ణి ప్రవేశపెట్టమన్నారు మా అత్తగారు.

రామశాస్త్రి వస్తూనే మా ముందు సాష్టాంగ పడ్డాడు. "యిక లేవరా!" అని మా అత్తగారు అరిచిందాకా అలా బోర్లా పడుకునే వున్నాడు.

అతి వినయంగా లేచి చేతులు కట్టుకుని నిలబడ్డాడు; మా అత్తగార్ని చూసి, తనకు ముసలివాళ్ళంటే ఎంతో భక్తి అన్నాడు; మా అత్తగార్ని చూస్తుంటే, చచ్చిపోయిన వాళ్ళ అవ్వ గుర్తుకొస్తోంది అంటూ కంట తడిపెట్టాడు.

"మర్యాదా మన్ననా తెలిసిన మంచి ముండావాడినే పంపించాడే. సరే, మన వంటవాడొచ్చిందాకా ఏదో అదీయిదీ అందిస్తూ పడుంటాడులే," అంటూ, దిక్కులు చూస్తూ నిలబడ్డ రామశాస్త్రితో, "ఒరే, అబ్బీ! నీకు జీతం లేదు...వేళకింత భోంచేసి పడి వుండు. సరేనా?" అన్నారు.

"ఓ! షష్టుగా పడుంటా," అంటూ ఎగిరి ఒక్క గంతువేసి, మరోసారి మా ముందు సాష్టాంగపడ్డాడు.

రామశాస్త్రి ఒక విచిత్రమైన వ్యక్తిలా కనిపించాడు. అంతే కాదు. అతని కంతకంటే విచిత్రమైన అలవా టొకటుంది. రోజూ పూజచేసి నేను మహానైవేద్యం పెట్టిన అన్నంగిన్నె మా అత్తగారికి కనిపించకుండా పెరటివేపుకు తీసుకెళ్ళి "కా, కా" అంటూ కాకికంటే కరెక్టుగా అరిచేవాడు. ఆ కేక విని ఎక్కడెక్కడి కాకులన్నీ పులోమంటూ రామశాస్త్రి ఫ్రెండ్స్‌లా రండుమని వచ్చి అతని చుట్టూ వాలేవి.

రామశాస్త్రి ముఖం ఆనందంతో మెరిసిపోయేది. గిన్నెడన్నమూ కాకులకు వేసేవాడు. పేరు పేరు వరుసలతో పిలుస్తూ, "తాతయ్యా! ఇది నీ ముద్ద... అవ్వా! యిందా నీది... నాయనమ్మా! నడవలేకుండా వున్నావా? ఇదో నీ వాటా... మామయ్యా! రారా! అత్తయ్య తినేలోపుగా నీ ముద్ద నువ్వు తినేసెయ్యి... అత్తా!

ఏం అంత దూరానున్నావ్ ? నీ గుణం పోనిచ్చావ్‌గాదే. సరే. విసిరేస్తా తీసుకో !" అంటూ కాకులన్నిటికీ తలోముద్దా వేసి, క్షణంలో గిన్నె ఖాళీ చేసేవాడు.

గిన్నె డన్నమూ తిని కాకులన్నీ అతని చుట్టూ గుమిగూడి, కొన్ని అతని తలమీదా, భుజాలమీదా ఎగిరెగిరి తన్నేవి, ఇంకా తీసుకురా అన్నం అన్నట్లు.

"యింక పొండర్రా ! వున్న అన్నం అంతా వేశానుగా ! అవును. నాకు తెలుసు మీ కడుపులు నిండలేదని. ఏం చేసేది ? రేషన్‌కాలం. బ్రతికున్నవాళ్ళకే తిండి దొరకడం లేదు. మీకీ పిడచయినా యీ కాలంలో ఎవరు పెడతారు ? నేను తప్ప ! నేను మంచివాడిని కదూ ?" అని రామశాస్త్రి కాకుల్ని అడుగుతూంటే, అవునన్నట్లు అవన్నీ "కా, కా" అంటూ గోలగా అరిచేవి.

ఆ కాకి గోలకు మా అత్తగారు లోపల్నుంచి కేకేసేవారు. మాకు వంటపనిలో సహాయంగా వుంటాడనుకుంటే, రామశాస్త్రి పని ఎగ్గొట్టి, దొంగలా తప్పించుకుని తిరుగుతూ, భోజనాల వేళకు కాకుల్తో కాలక్షేపం చేస్తూవుండేవాడు, వడ్డించే సహాయంగూడా చేయకుండా.

"ఏమిట్రా నీ గొడవ ? వంటా రాదు, వల్లకాదూ రాదు, నే వండిందంతా తీసుకెళ్ళి కాకులపాలు చేస్తున్నావే !" అంటూ మా అత్తగారు కోప్పడేసరికి. "అపచారం, పెద్దమ్మగారూ, అపచారం ! మీరు నరకానికి పోతారు," అన్నాడు.

మా అత్తగారు ఉలిక్కి పడ్డారు....

"వాళ్ళంతా కాకులు కారు, పెద్దమ్మగారూ !"

"మరి ఏమిట్రా ?"

"వాళ్ళంతా పితృదేవతలు, పెద్దమ్మగారూ పితృదేవతలు – మనసులో ఏది కావాలని కోరుకుంటే అది ముక్కున కరుచుకొచ్చి పడేస్తారు."

ఆమాట వినంగానే మా అత్తగారు ఆశ్చర్యపడిపోతూ

"నిజంగానట్రా ?" అన్నారు.

"అవునమ్మగారూ ! మీకో సంగతి తెలుసా ? నే పుట్టే ముందు మా అమ్మకల్లో మాతాతకనబడి, 'అమ్మాయీ, మాకు తృప్తిగా అన్నంపెట్టే పౌత్రుడు నీకడుపున పుట్టబోతున్నాడూ, వాడికి రామశాస్త్రి అని నాపేరేపెట్టు,' అంటూ గంట కొట్టినట్టు చెప్పాట్ట. నే పుట్టాను. నా అన్నప్రాశన రోజు నేను మొదట అన్నం గిన్నె చేత్తో పట్టుకున్నానట. వెంటనే "కా, కా" అంటూ మా తాతా, అవ్వా వాళ్ళంతా వచ్చేశారట. గిన్నెలోవున్న అన్నం అంతా వాళ్ళకే వేశానట. అది చూసి మా అమ్మావాళ్ళు, మా తాతకల్లో చెప్పింది జరిగిందని ఆశ్చర్యపడిపోయారట. యీ అలవాటు నాకు చిన్నప్పట్నుంచీ వుంది, పెద్దమ్మగారూ. నే నన్నం తినేప్పుడు మరింతఅన్నం ముందే అడిగి పెట్టించుకుని, పెద్దవాళ్ళ కేస్తూంటాను. ఒక్కొక్క రోజు అన్నం లేకపోతే, నాఅన్నం వాళ్ళకేసి, నేను పస్తుంటాను, తెలుసా ?"

"హవురా ! హవురా ! ఎంతటి పుణ్యకార్యం చేస్తున్నావురా ! నిజంగా నువ్వు పితృదేవతలపాలిటి కల్పవృక్షానివిరా ! అది సరేగానీ, మాతాతా అవ్వా అంటున్నావే, కాకి రూపాల్లో వున్నవాళ్ళ నెట్లా గుర్తుపట్ట గలుగుతున్నావురా ?"

రామశాస్త్రి బిగ్గరగా నవ్వాడు. "అదేంకష్టం, పెద్దమ్మగారూ ! నేనంటే మా పెద్దవాళ్ళల్లో ఎవరెవరి కెంతప్రేమో, వాళ్ళొచ్చి నాచుట్టూ వాలేప్పుడే కనిపెట్టేస్తానుగా ! మాతాతకీ, అవ్వకీ నేనంటే ప్రాణం. మా నాయనమ్మా, మా పెత్తల్లీ, కక్కావాళ్ళూ కూడా ప్రేమగానే వస్తారు. యిక ఎటొచ్చీ మా అత్తకే నేనంటే సరి పడదు. అందుకే ఎంతపిల్చినా దగ్గరికిరాదు. అల్లంత దూరానవుండే అన్నంముద్ద అందుకుని ఎగిరి పోతుంది...... నేనంటే యింకా మా అత్తకి ఒళ్ళుమంట తగ్గలా. మళ్ళీ మా మామ పర్వాలా ? మంచివాడే !"

"అవునుగానీ, రామశా ! ఇందాక నువ్వన్నావే, మనసులో ఏది కావాలనుకుంటే అది ముక్కున కరుచుకొచ్చి పడేస్తారని, నీ కట్లా ఏమైనా మీ వాళ్ళు ముక్కున తెచ్చి పడేశారా ?" అని ఆశగానూ, ఆతృతతోనూ అడిగారు, చచ్చిపోయిన వాళ్ళ అవ్వ, తిరిగి బ్రతికివచ్చి ఆమె నగలమూట తనకే యిస్తుందని సోదిమనిషి చెబితే నమ్మి, దానికి తన పట్టుచీరా, పాతిక రూపాయలూ ఇచ్చి, అరబస్తా బియ్యంకూడా అర్పించిన మా అత్తగారు.

మా అత్తగారి ఉత్సాహం చూసి రామశాస్త్రి కాస్త విజృంభించాడు.

"ఓ ! పడేసిందే ! ఒకరోజు మా అవ్వకాకి నాలుగుపేటల బంగారు గొలుసు ముక్కున కరుచుకొచ్చి, వంటింటి వాకిట్లో పడేసింది."

"నిజంగానట్రా ? ఓ యమ్మా ! యిదెక్కడి వింతరా ! నేతిచిట్లూ, నేతి మిల్లులూ ముక్కున కరుచుకొచ్చి కాకులు పడెయ్యడం చూశానుగాని, యిట్లాంటి విషయం యింతవరకూ నేను కనీ వినీ ఎరగనే !" అన్నారు ఆశ్చర్యపడిపోతూ మా అత్తగారు.

"అవి కాకులైతే గదా ! మన పితృదేవతలు. అందరికీ ఎందుకిస్తారు అట్లాంటి బంగారు వస్తువులు ? అందరూ నాలాగా రోజూ వాళ్ళకింత అన్నం వేస్తుంటే గదా పెద్దవాళ్ళకు మనమీద దయ కలుగుతుంది ? సంవత్సరాని కొకసారి తద్దినం పెట్టి ఓ ముద్ద వాళ్ళ ముఖాన పారేస్తే పాపం వాళ్ళకేం చాల్తుంది ? సంవత్సరం పొడుగునా వాళ్ళ కెవరు పెడతారు ?"

"హవురా ! హవురా ! చిన్నవాడివైనా ఎంత పెద్దవిషయం చెప్పావురా ! యింతకీ ఆ నాలుగుపేటల గొలుసూ ఎవరిదిరా ?"

"ఎవరిదో ఎందుకు తెచ్చి పడేస్తుంది ? మా అవ్వ దొంగకాదు.

అట్లాంటి గొలుసే మా అవ్వకుండేది. అది మా ఆవిడి కివ్వాలని అనుకుంటూనే కన్నుమూసింది. మా అత్త రాక్షసి ఆ గొలుసు కొట్టేసి అమ్మేసుకుంది. ముప్ఫయి సవర్లగొలుసు. మా అవ్వ ఎట్లాగో ఆ గొలుసు తీసుకొచ్చి మా కిచ్చి అన్నమాట నిలబెట్టుకుంది. ఆ గొలుసు యిప్పుడుకూడా మా ఆవిడ మెళ్లో ఉంది.''

అని రామశాస్త్రి చెబుతుంటే భోజనంమాట మర్చిపోయి, రామశాస్త్రి కెదురుగా ఉన్న అరుగుమీద కూర్చుని, "యింకా ఏమేం తెచ్చి పడేశార్రా మీ వాళ్లు ?" అంటూ అతి ఉత్సాహంతో అడిగారు మా అత్తగారు.

"ఓ యబ్బ ! ఎవరికి జ్ఞాపకం ? ఒకసారి రాళ్లు తెచ్చి పడేశాడు మా తాతకాకి."

"రాళ్లా !" అన్నారు మా అత్తగారు భయపడుతూ.

"ఆఁ మంచి రాళ్ళు...వజ్రాలూ, కెంపులూ."

"ఓ యమ్మ, వజ్రాలూ, కెంపులే."

"అవునూ ! ఒకసారి నేను మనసులో కెంపుల వుంగరం పెట్టుకోవాలనుకున్నా. మర్నాడే మా తాతయ్యకాకి ఒక కెంపుల వుంగరం తెచ్చి నా ముందు పడేశాడు."

"ఏదిరా ఆ వుంగరం ? ఏదీ ?" అంటూ రామశాస్త్రి వేళ్ళన్నీ వెతికారు మా అత్తగారు.

"అమ్మేశానమ్మా. అందుకే ఆ రోజునుంచి మా అవ్వా, తాతా నా కేమీ యివ్వడంలేదు," అన్నాడు బుంగమూతి పెట్టి రామశాస్త్రి.

"అట్లాగా ? అది సరేరా ! మరి నేనూ నీలాగా అన్నం వేస్తే మా పితృదేవతలంతా కాకుల్లా వస్తారా ?"

"ఓ ! ఎందుకురారూ ?...అసలు కాకు లెవరనుకున్నారు ? వాళ్ళేగా ! పిలవండి ! వస్తారో లేదో చూద్దాం ! అన్నట్లు మీ తాత పేరేంటి ?"

"పరాంకుశం."

"అవ్వ పేరూ ?"

"అమృతమ్మ."

"మీ నాన్న పేరు ?"

"శ్రీరంగనాథరావు."

"అమ్మ పేరు ?"

"ఆండాళమ్మ."

"వేరీగుడ్. చేతులో అన్నం ముద్దలు పెట్టుకొని పేర్లతో పిలుస్తూ పడేయండి...రేపట్నుంచి మీ పూర్వీకులంతా మీ చుట్టూ వాలకపోతే నన్నడగండి.''

మర్నాడు మా అత్తగారే స్వయంగా నైవేద్యం పెట్టిన అన్నం గిన్నె పట్టుకుని పితృదేవతల్ని ఆహ్వానించడానికి బయల్దేరారు.

రామశాస్త్రిగూడా మా అత్తగారి వెనకాలే పెరట్లోకి వెళ్లాడు.



మా అత్తగారికి అప్పుడే రామశాస్త్రి పితృదేవతలమీద అనాదరణ కలిగింది.

"ఒరేయ్ ! నువ్వు అలవాటు ప్రకారం మీ వాళ్ళందర్నీ కేకెయ్యక. నేను మా అవ్వను పిలవాలిప్పుడు."

"అదేమిటి, పెద్దమ్మగారూ ? అవ్వకు మాత్రం ఎందుకా స్పెషల్ ఆహ్వానం?" అన్నాడు రామశాస్త్రి 'క్వశ్చన్ మార్క్'లా నిలబడి.

"ఎందుకా ? నీ పెళ్ళాంకోసం మీ అవ్వ ఒక్క గొలుసే తెచ్చి పడేసిందిరా. నా కోసం మా అవ్వ లక్షరూపాయల నగలు మూటగట్టిపెట్టిందిరా. నా దురదృష్టం. ఆ మూట కాస్తా గుంటూర్లో దొంగలు దోచుకుపోయారు. నాకు చెందాల్సిన మూట అది."

"ఓహో ! ఆనగలమూట కోసమా ?

"అవున్రా ! ఒరేయ్, రామ్‌శా, ఆనగలమూట తీసుకురా, అవ్వా, అని మనసులో అనుకుంటే తెస్తుందిట్రా !" అన్నారు మా అత్తగారు, అటూ యిటూచూసి ఎవరైనా వింటారేమోనని రహస్యంగా.

''ఓ ! ఎందుకుతేదూ ?''

"సరే, యీసంగతి ఎవరితోనూ చెప్పవాక.''

"అబ్బే ! నాకే చెప్పను."

"నీకు చెప్పే దేమిట్రా ?" అన్నారు, అయోమయంగా రామశాస్త్రివేపు చూస్తూ.

"తన్ను తాను తెలుసుకోడం ఎలాంటిదో అలాంటిదే నాకు నేను చెప్పుకోడం ?" అన్నాడు నవ్వుతూ రామశాస్త్రి.

''సరే, ఏడ్చినట్టేవుందిలే నీ వేదాంతం. అన్నట్టు కాకుల్ని కేకెయ్యాలే, ఎట్లారా ?''

"అపచారం, పెద్దమ్మగారూ ! అవి కాకులు కావు."

''అదే, అదే అపచారం ! మర్చిపోయి అన్నాన్లే. ఎట్లా అరవడం !''

"పోనీ మీకోసం నేను ప్లేబాక్ అరుస్తాను.'' 'కా, కా, కా, కా ?'' అంటూ అరిచాడు రామశాస్త్రి. పులోమంటూ వచ్చి

అతనిచుట్టూ వాలాయి ఒక డజను కాకులు. మా అత్తగారికి ఎక్కడ లేని కోపం వచ్చింది.

"నువ్వు మీవాళ్ళని పిల్చుకుంటే నా గతేమిట్రా ? నేను మా అవ్వనిగదా పిలవాలనుకున్నాను ?"

''మీరేమన్నా చెప్పండి, పెద్దమ్మగారూ, ముసలివాళ్ళు కంపెనీ లేకుండా ఒంటరిగా రారు. కనీసం మీతాతన్నా వుంటాడు పక్కన."

"సరే, మాఅవ్వా, తాతావాళ్ళని నేనే పిలుస్తాను, ముందు మీవాళ్ళందర్నీ పొమ్మను," అంటూ అన్నంగిన్నె దాచిపెట్టారు, మా అత్తగారు.

రామశాస్త్రి విరగబడినవ్వుతూ, ''అదికాదు, పెద్దమ్మగారూ ! మా అవ్వా తాతా, మీ అవ్వా తాతా- వేషాలు యీ కాకులేగా వేసేది! సినిమాల్లో చూశారా, ఒకే య్యాక్టరు ఎంతమందికో నాన్న వేషం వేస్తూంటాడు. మీరుమాత్రం ? ముందు జన్మల్లో ఎంతమందికి అమ్మగా పుట్టారో !''

"సరేలే, అఘోరించినట్లేవుంది నీ వేదాంతం. ముందాకాకుల్ని పొమ్మను" అన్నారు మా అత్తగారు, విసుక్కుంటూ.

''సరే...తాతయ్యా, అవ్వా, యీరోజు మీనోట్లో మట్టిగడ్డ ! పోండి,'' అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ రామశాస్త్రి.

కాకులన్నీ ఎగిరిపోయాయి.

మరుక్షణం మా అత్తగారు సిగ్గువిడిచి, 'కాకాకా' అంటూ గోలగా అరిచారు. ఒక్క కాకిరాలేదు. మా అత్తగారి ముఖం వెల వెల బోయింది.

రామశాస్త్రి విరగబడి నవ్వుతూ, ''చూశారా మన తడాఖా ? మావాళ్ళకు ముద్ద వెయ్యకపోతే మీ ముసలివాళ్ళని రానిస్తారా ? పాపం, మా తాతా, అవ్వా ఉసూరుమంటూ వెళ్ళారే !''

"పోనీ, వాళ్ళనే పిలువు. వాళ్ళకు రెండు ముద్దలువేసి, తర్వాత మా అవ్వావాళ్ళని పిలుస్తా," అన్నారు చిన్నబుచ్చుకున్న మా అత్త గారు. ఆమాటవిన్న రామశాస్త్రి ''కా, కా, కా'' అంటూ ఆనందంతో చిందులు తొక్కడం మొదలుపెట్టాడు. యీసారి యిరవై ముప్పై కాకులు ఒక్కసారిగావచ్చి వాలాయి. రామశాస్త్రి సంతోషంతో చప్పట్లుకొడుతూ, ''యిందులో మీ అవ్వా, తాతా, మీ అమ్మా నాన్నాగూడా వున్నారు. మావాళ్ళు యింతమంది రారు'' అన్నాడు. దానికి తగినట్లే చేతులో అన్నంగిన్నె తెల్లగా తెలుస్తున్నందువల్ల కొన్ని కాకులు మా అత్తగారిచుట్టూ చేరాయి. ఒకకాకి మా అత్తగారి తలమీద తన్నింది, "ఛీ, ఛీ !" అన్నారు మర్చిపోయి. మరుక్షణం ఆమెకు గుర్తొచ్చి, "ఒరేయ్ ! రామశా యిది మాతాత కాకేరా ! మాతాత బ్రతికుండగా ఎప్పుడూ యిట్లాగే నాతలమీద కొట్టేవాడు. మరి మా అవ్వకాకి నెట్లా కనుక్కోడంరా ?"

"అదుగో తాతకాకి పక్కనవుందే, అదే మీ అవ్వకాకి.''

"నగలమూట సంగతి అడగనట్రా ?''

"ఓ ! అడగండి. యీరోజు గాకపోతే రేపైనాతెచ్చి పడేస్తుంది. యీనెహ్రూ మాటంటే మాటే !"

''నెహ్రూ ఎవట్రా ?"

"నేనే," అన్నాడు స్టయిల్‌గా రామశాస్త్రి.

''ఏడ్చావుగానీ, యిక్కడుండే అడుగుతా. దగ్గరికెళ్తే ఎగిరి పోతుందేమో,'' అంటూ "అవ్వా ! నీ నగలమూట ఎవరు దొంగి లించారో వాళ్ళ నెత్తిమీదకొట్టి ఆమూట తీసుకొచ్చి నాకివ్వవే !'' అంటూ గారంగా అడిగారు మా అత్తగారు, వాళ్ళ అవ్వకాకిని చూస్తూ. వెంటనే అవ్వకాకి ''కా కా" అంటూ గట్టిగా అరిచింది. అదివిని మా అత్తగారు పొంగిపోతూ, ''ఒరేయ్ ! రామ్‌శా ! తెస్తానంటూందిరా '' అని అరిచారు.

''బేష్, బేష్ ! అవ్వకాకీ ! తప్పకుండా ఆమూట తీసుకొచ్చి, యీ నెహ్రూమాట నిలబెట్టు. యిక మీరంతా పొండి. రేపురాండి," అంటూ అన్ని కాకుల్నీ తరిమేశాడు రామశాస్త్రి.

మర్నాడు మామూలుకంటే మరికాసిని బియ్యం అధికంగాపోసి వంటచేసి పెద్ద అన్నంగిన్నెతో, పెరట్లోకెళ్ళి, వంటవాడి ప్లేబాక్ అవసరం లేకుండానే 'కా, కా' అంటూ అరిచారు మా అత్తగారు. తక్షణం యాభైకాకుల్దాకావచ్చి ఆమెచుట్టూ వాలాయి.

''అదేమిట్రోయ్ ! బలగం యిట్లా పెరిగింది. వీళ్ళంతా ఎవరంటావ్ ?''

''మీ యిరుగు పొరుగువాళ్ళ బాపతై వుంటారు. మీ దూర బంధువులూ, స్నేహితులూ—''

"అది సరేరా ! వీళ్ళల్లో మాఅవ్వకాకిని కనుక్కోడం ఎట్లా?"

''మీ అవ్వకాకి యింకా రాలేదేమో! ఏదో మూటతెమ్మన్నారుగా ! తెస్తూవుంటుంది. నగలమూట బరువుగదూ ? పాపం ! అసలేముసల్ది, నెమ్మదిగా తెస్తూంటుంది— అదుగో ! మీ అవ్వకాకి, ఏదో నోట కరుచుకొస్తోందే !" అని రామశాస్త్రి అంటూండగానే ముక్కున వున్న కప్పను మాఅత్తగారి నెత్తిమీద పడేసి, అన్నంగిన్నె చుట్టూ ఒక ప్రదక్షిణంచేసి వెళ్ళి దూరంగావాలింది అవ్వకాకి. "ఛీ. ఛీ. ఛీ ! యిదేం ఖర్మంరా !'' అంటూ అన్నంగిన్నె ఎత్తి కిందపడేసి చిందులు తొక్కుతున్న మా అత్తగార్ని చూసి, ''భలే, భలే," అంటూ చప్పట్లుకొట్టి నవ్వడం మొదలెట్టాడు రామశాస్త్రి. మా అత్తగారికి ఒళ్లు మండిపోయింది,

"ఒరేయ్! ఏమిట్రా ఈ దరిద్రాన్ని తెచ్చి తలమీద పడేసిందీ?"

"మీ అవ్వ కప్పలు తింటుందేమో ! అందుకే మీ కొకటి తెచ్చి పడేసింది."

"ఛీ. ఛీ, నోర్మూయ్. మళ్లీ ఆ కూతకూస్తే పళ్ళు రాలగొడతాను."

"వాట్ ! ఏమన్నావ్ ! ముసలిదానా ! నా మీదే అధికారం చెలాయిస్తున్నావా ? నేనెవరనుకున్నావ్ ? నెహ్రూ ! నెహ్రూ

పళ్లు నువ్వు రాలగొడతావా? నాకు తెలుసు నువ్వు యిందిరాగాంధీ ననుకొంటున్నావ్. నీకు తెలీదు నేనే నెహ్రూ అని. నా కూతురు నువ్వు. నేను బ్రతికి ఉన్నంతకాలం నీకీ పదవి వచ్చిందా? రాలేదు. నేను చచ్చిపోయాను. అందుకే యింతగా విజృంభించావ్! నిన్నింత జేసిన పెద్దవాళ్ళకే నామాలు వేస్తావా?" అంటూ రామశాస్త్రి మా అత్తగారి మీదిమీదికీ వస్తూంటే అయోమయ స్థితిలో వున్న మా అత్తగారి పై ప్రాణాలు పైన్నే పోయాయి.

యింతలో మా పనివాడు పరుగెత్తుకొచ్చి, "అమ్మా, అమ్మా, వీడు వంటవాడు కాదు, పిచ్చివాడు. పిచ్చాసుపత్రినుంచి పారిపోయి వచ్చాడంట. వీడికోసం వాళ్ళ వాళ్ళొచ్చి గేట్లో కాచుకోనున్నారు," అని.చెబుతూంటే, మా అత్తగారు ఒక్క వెర్రికేక పెట్టి గడగడ వణుకుతూ వచ్చి నన్ను గట్టిగా పట్టుకున్నారు. ఆమెకు పిచ్చివాళ్ళంటే చచ్చేంత భయం. తక్షణం వాణ్ణి అక్కణ్ణుంచి తరిమేశాం. అదే సమయానికి మా పాత వంటవాడుకూడా వచ్చాడు. మా అత్తగారు వాణ్ణి గుర్రున చూశారు.

తనవల్లే యింత గొడవ జరిగిందనీ, తను చెప్పిన వంటవాడు తనకంటే ముందే వూరి కెళ్లాడనీ, అందుకే తను అన్నప్రకారం వంటవాడిని పంపలేకపోయాననీ నొచ్చుకున్నాడు మా వంటవాడు.



తర్వాత నాలుగురోజులుదాకా మా అత్తగారు మామూలు మనిషి కాలేదు. రామశాస్త్రి పేరెత్తితే ఆమె అదిరిపడేది.

అమ్మో! అమ్మో! ఒక పిచ్చివాణ్ణి వారంరోజులు యింట్లో పెట్టుకున్నామే. తల్చుకుంటేనే గుండె దడొస్తోందే. అవురా! హావురా! ఎంత మోసపోయాను! వీడి కాకులు మండిపోను!"

